

# ఫోటోగ్రాఫర్

సాదా

కథలో రాసిన మనుషులు మనకు ఎదురుపడరు అనే రూల్‌లాంటి నమ్మకంతో నేనిదివరకు ఈ ఫొటోగ్రాఫర్ అమ్మాయి గురించి రాశాను వొక పత్రికలో. అది రాసి చాలారోజులు గడిచిపోయింతర్వాత మొన్న ఒక బస్సులో ఆమె కనబడి నవ్వితే తేరుకోలేకపోయాను.

ఆమేనా అనుకుంటూ వుండగా ఆమే నా దగ్గరి కొచ్చింది లగేజీతోబాటు. నేను లేవబోయాను పలకరింపుగా. ఆమె నిలబడే నాతో మాట్లాడింది.

ఈలోగా కండక్టరు అరిచాడు, "దిగాలండీ," అని. అది కనీసం రిక్వెస్టు స్టాపు కూడా కాదు. అంతే- అమ్మాయిలు రిక్వెస్టు చేస్తే ఎక్కడైనా ఆగుతుంది ఎక్స్‌ప్రెస్ బస్సు. ఆమె చెయ్యి ఊపుతూ దిగిపోయింది.

నేను సీటుకు అంటుకుపోయాను.

ఆమె నేను రాసిన కథ చూసింది!

సిగ్గుచేటు. నా కథలో నిజమేదో అబద్ధమేదో తెలుసుకోగల మనుషులు ఎవరూ ఉండరనే అభయంతోనే కదా ఆ కథను లోకం యెదాన పడేసింది! ఇప్పుడేమయింది. నా తలవొంపుల కింద దాన్ని బలిపెట్టాను.

"షూట్ చెయ్యడం గురించి నేనన్నది రాయలేదేం?" అంది ఆమె.

అదే తీరు. ఏ ఉపోద్ఘాతమూ ఏ సంబోధనా లేకుండా మాట్లాడేతనం. యెన్నాళ్ల కిందో ముగిసిన మాటల తర్వాత వొక్క గడియ కూడా యెడం రానట్టు మాట్లాడిందామె. నేను గమనించలేదామెను. ఆమే దిగిపోవడానికి లేవబోతూ నన్ను చూసింది. అప్పటికి మూడు గంటలుగా ఆ బస్సులోనే ప్రయాణిస్తున్నాం. బహుశా అంతసేపూ గనక మాటలు జరిగి వుంటే నా అపరాధభావం వొదిలి వుండేదేమో.

"నీ కథలో నాయిక పెద్దకులంలో పుట్టినట్టుంది. నువ్వది కావాలని రాసి వుండవు. వూరికే చెక్ చేసుకో. తెలుగులోని గొప్ప రచయితల్ని చదవడం వల్ల నీకు తెలీకుండానే అంటి వుంటుంది ఆ జాడ్యం. కథలో మనుషుల్నీ సన్నివేశాల్నీ నీ అభిప్రాయాలకి సరిపడేటట్టుకుందితే యెట్లా? నువ్వేం నేర్చుకోవా? బోధించేస్తావా అంతా? కలల్నీ అభిప్రాయాలన్నీ శోధించుకోడానికి అవసరమైతే వాటిని మీరడానికి సిద్ధపడి కథలోకి వెళ్లాలి గానీ నీ అభిప్రాయాలేవో ప్రామాణికమైనట్టూ వాటిని చెప్పడం గొప్ప ముఖ్యమైనట్టూ రాస్తే నవ్వురాదా? సత్యాల్ని శోధిస్తున్నామనుకొని వాళ్ల సంశయాలను మాత్రమే రాసే హీనులను చూస్తే కూడా చాలా జాలి వేస్తుంది నాకు. కీర్తి సోమరితనం వల్ల పాఠకుల ముతక సెంటిమెంట్లతో లాలూచీ పడతారు వాళ్లు. ఖాళీబుర్రతో చూస్తుంది వ్యూఫైండర్. కెమెరా అయినా తుపాకీ అయినా అంతే. దానికన్నా మెరుగ్గా చూడాలి మనిషి. మరీ ముఖ్యంగా కవీ కళాకారుడూ," అందామె- బై చెప్పి దిగిపోతూ.

కనీసం నోరు విప్పలేకపోయాను నేను.

సన్నగా తలపోటు మొదలయింది నాకు.

యింక జన్మలో కథ రాయను.

నేరుగా గదికొచ్చి పాత కాయితాలు తీసి దుమ్ము దులిపాను. నాకు నచ్చిన సంభాషణల్నీ, సంఘటనల్నీ రాసుకునే వ్యసనం వల్ల ఆ కవిలికట్టలు అంతగా బలిశాయి. వొకనాడెప్పుడో యీ ఫొటోగ్రాఫర్ పిల్ల మాట్లాడిన మాటల్ని చిత్తు కాయితాల మీద రాసిపెట్టుకున్నా,

యెప్పుడయినా కథ రాయొచ్చుననుకుని. నిశ్చల ఛాయా గ్రాహి అని శీర్షిక కూడా పెట్టానొకమూల. అది చూసి నవ్వొచ్చింది.

నిజంగానే ఆ పిల్ల ఫొటోగ్రాఫర్ అని నమ్మి ఒక నిర్ణయానికొచ్చినప్పటి కాయితాలవి. తర్వాత వొక మేగజేన్‌లో సాయుధ గెరిల్లాల గురించిన వ్యాసంలో ఆమె ఫొటో చూసి నాకు బాగా తాటాకులు కట్టింది అనుకున్నాను. ఆ ఫొటోలో చాలామంది గెరిల్లాలున్నారు. ఆడామగా అవే కళ్లు. శ్రీకృష్ణుడి కొంటెతనం. ఆలివ్ గ్రీన్ యూనిఫామ్. చేతిలో ఏకే 47.

తర్వాత ఆమె ఫొటోగ్రఫీ అనుభవాల గురించి చెప్పిన మాటల్ని నాకు మిత్రుడైన వొక సినిమాటోగ్రాఫర్‌కి చెప్పాను. అతడూ సముద్రయాత్రలు చేసిన వాడే. ఆమె చెప్పిన ప్రతి మాటా నిజమేనని చెప్పాడు. చూడగా చూడగా ఆమె సంభాషణలకొక క్లాసిక్ స్థాయి వున్నట్టు తోచింది నాకు. కాలం గడిచేకొద్దీ ఆ మాటలు కూడా ఎదుగుతున్నాయి. ఆమె మాటల ఆధారంగా కథ రాయడం తప్పు అనిపించింది. నా కలని వొలిచి వున్నది వున్నట్టు చెప్పడమే చెయ్యగలిగిన పని అని తోచి కొంచెం ఎడిట్ చేశానిప్పుడు. వొక్కొక్క కాయితమూ చదువుతుంటే ఆమె నాకెట్లా తారసపడిందో మెదిలింది. వొక రైతుకూలీ సభకు పోలీసులు పర్మిషన్ లేదని చెప్పి రాత్రి సభ జరుగుతుంటే జనాలని కొట్టారు. కొందరిని ఎత్తుకుపోయారు. చాలామందికి కాళ్లూ, చేతులూ, తలలూ పాడుచేశారు. కాల్పులు చెయ్యలేదు. సంఘటన తెలిసి నేను రిపోర్టింగ్‌కని వెళ్లాను. అంతా విరిగిపోయిన గుంజలూ, పడిపోయిన పందిళ్లూ. సభ కోసమని బాగుచేసిన అతి పెద్ద బీడుభూమి అది. తెలంగాణలోని గ్రామీణ ప్రాంతం. అప్పటికి రాత్రి బాగా పొద్దుపోయింది. పైనుంచి మబ్బులు ముమ్మరంగా కమ్ముకొస్తున్నాయి. అంధకారం అంతకంతకూ అలుముకుంటూ వుండగా చందమామ కడగంటి చూపులో సభా నిర్మూలనం బీభత్సంగా కనబడింది. నా నికాన్ యస్సెల్లార్‌తో ధన్‌ధన్‌మని షూట్ చేశాను కొన్ని స్నాప్స్. బస్సు సౌకర్యం లేని ఆ సంఘటన స్థలానికి నడిచి చేరడమైతే చేరాను గానీ మనుషులే లేరు. సాటి రిపోర్టరు జీవీ కనబడలేదు. చలిగాలిని తోసుకొచ్చింది వాన. ఎక్కడా తలదాచుకునే పాటి చెట్టు కూడా లేని చిత్రమైన బీడు అది. మెరుపు మెరిసి పెద్దగా వురుము వినవచ్చింది. ఆ వెలుగులో అల్లంత దూరంలో ఏదో చావిడిలాంటిది కనిపించింది. పరిగెత్తానక్కడికి. అది చావిడి కాదు. సభావేదిక. చిన్న చిన్న గుంజల మోపున యెత్తుగా కట్టి వుందది. దాని కింద తలదాచుకోవచ్చునని అడుగు వేశానో లేదో క్లిక్‌ని వొక ఫ్లాష్ వెలిగిపోయింది నా ముందు. ఎవరో ఫొటో తీశారు పైనుంచి అనుకుంటూ ఉండగానే ఆ వేదిక కింద మనుషులున్న విషయాన్ని నా కళ్లు నాడీమండలంలోకి చేరవేశాయి.

నేను బిగుసుకుపోయాను.

వర్షపు హోరు కూడా వినిపించలేదు వొక క్షణం నాకు. యాడ్చి యాడ్చి కొడుతోంది వాన. నేను నిలువునా తడుస్తూ వొణుకుతూ నిలబడ్డాను.

నా కెమెరా బ్యాగ్ తడిసిపోకుండా చూసుకోవడం నా తక్షణ కర్తవ్యం.

"హలో నేను జర్నలిస్టును," అని నా పేరూ గీరూ చెప్పకుండా అరిచాను.

"నేనూ ఫొటోగ్రాఫర్ని. రండి," అని ఒక ఆడపిల్ల గొంతు బదులిచ్చింది. ఆ వెంటనే చిన్న టార్చిలైటు వెలిగింది.

నేను గబగబా వేదిక బల్లచెక్కల కిందికి దూరబోతుంటే,

"తేళ్లుంటాయ్. ఆ షామియానా గుడ్డ మీద నుంచి రండి," అంది అమ్మాయి గొంతు. బల్లచెక్కల సందుల నుంచి వాన జాడిచ్చి కొడుతోందిగానీ కొంచెం సేపటికి మెలకువ తెలిసింది యెట్లా కూచోవాలో. ఇంతలో టార్చి వెలుగు వొక మూలకి తిరిగింది.

తేళ్ల కుప్ప. చచ్చిన తేళ్లు కుప్పగా పోసి వున్నాయి. లాఠీఛార్జి టియర్‌గ్యాస్‌ల మధ్య జనాలు పరుగెత్తిన అదురుపాటుకు చిత్తడి బీడు నుంచి పిగిలి పైకొచ్చిన తేళ్లు. ఆ బీడుభూమి అంతా ఆ చీకట్లో యెన్ని తేళ్లు చచ్చాయో ఎన్ని పాకుతున్నాయో తెలీదు. గుడ్డపేలికలు కాలుస్తూ ఆ వెలుగులో ఎవళ్లకి కనిపించిన తేళ్లని వాళ్లం చంపుతూ కూచున్నాం ఆ రాత్రి. నాకు ముందు భయంతో వొళ్లు జలదరించింది. అసలే కుండపోత చీకటి, చలి. వీటికితోడు తేళ్లు. వింతయిన కష్టాలెప్పుడూ నవ్వు తెప్పిస్తాయి ఇతరులకు. నవ్వే సమయం లేదు. గడ్డిపరక తగిలినా చెప్పుతో కొడుతున్నాను. తేళ్ల వేటలో నా తువ్వాలు మొత్తం ఆహుతి అయిందిగానీ వర్షం మాత్రం ఆట ఆపలేదు.

ఇంక ఈ రాత్రి చేసిన జాగారంలో ఆ ఫొటోగ్రాఫర్ అమ్మాయి మాట్లాడిన మాటలే ఈ కథ. ఆమె మాటలు నా అభిప్రాయాలకు వ్యతిరేకంగా వున్నా యథామూలం మార్చను. ఇదివరకు రాసినప్పుడు తీసివేసిన మాటల్ని

కూడా ఉంచేశాను. నేను ఇరికించినవి తీసేస్తాను. ఆనాడు ఆ అమ్మాయి మాట్లాడిన మాటల్ని నేను రాసుకున్న కాయితాలు ఇవి.

**కాయితం-1**

"అయితే వాన సాయంకాలపు నీరెండలో నడి సముద్రంలో పడుతుంటే చూడాలి. అంతా యెడారి మాదిరిగా వుంటుంది. ఎంత కళ్లు పొడుచుకున్నా సముద్రమే తెలియదు. ఆ ఏటవాలు సూర్యరశ్మిలో వాన సముద్రాన్ని అలుకుతుంటే ఎంత హైస్పీడ్ సెన్సిటివ్ ఫిలిమ్ అయినా ఎడారిని తప్ప ఇంకేం తియ్యదు. మనం ఎంత యేమారిపోతామంటే చివరికి ఆ నకిలీ ఎడారిలో మనకు ఎండమావులు కూడా కనిపిస్తాయి," అంది ఆ అమ్మాయి ఏ ఉపోద్ఘాతమూ లేకుండా.

రెండో కాయితం తీసేశాను. అవి నా మాటలు.

మంచి కాలక్షేపమే అనుకున్నాను.

**3**

"మీకు తెలుసా సముద్ర ప్రయాణంలో వాన ఒక వారంలో స్త్రీల వయసును ఎంతో తగ్గించేస్తుంది. ఈ వింతకి ఎక్కడా వివరణ లేదు. యెట్టికి డబ్బు మూల్గే వాళ్లు కేవలం ఫొటోలు దిగడానికే సముద్రంలో పిక్నిక్ ప్రయాణాలు చేస్తుంటారు, పరువంగా కనిపించే ఫొటోల కోసం. నేను అల్లాంటి వాళ్లని ఫొటోలు తీశాను అధికారికంగానూ, అనధికారికంగానూ," అందామె.

నేను కేవలం వింటున్నాను. ఆమే మాట్లాడుతోంది.

"తమాషా యేమంటే మగవాళ్లు మాత్రం వయసు ముదురుతారు," అని ఆమె నవ్వింది.

నాకు నవ్వు రాలేదు.

"వర్షాన్నే కాదు- దేన్నయినా మేం సహించినంతగా మీరు సహించలేరు. మీరెప్పుడయినా సముద్ర ప్రయాణం చేశారా," అని ఆమె అడిగింది.

**4**

"ఉహూ," అన్నాను.

"నా వృత్తే సముద్ర ప్రయాణం," అందామె.

ఇంతలో పెద్ద మెరుపు మెరిసింది. కల్లు దీబూసిపోయాయి. ఆ కాంతిలో మా చావిడి ఎక్కడికో కొట్టుకుపోతున్నట్టు తోచింది. మళ్లీ చీకట్లోని మసకకి అలవాటు పడ్డం కోసం కళ్లు మూసుకున్నానో లేదో మళ్లీ మెరుపు. వెలుగు మరక అంటింది నా కనురెప్పలపైన. అది చాలాసేపు వుండిపోయింది.

"ఎర్రటి ఎండ కింద కళ్లు మిరుమిట్లు గొలిపే మంచులో తిరిగాను నేనొకసారి రోజంతా. చీకటి పడగానే నా బస చేరుకున్నా. ఏముంది ప్రతి వస్తువూ ఎర్రటి రంగులో కాలిపోతున్నట్టే కనిపించడం మొదలు పెట్టింది. చివరికి అద్దంలో నా ముఖం కూడా కాలిపోతోంది. వరసగా మూడు రాత్రిళ్లూ మూడు పగళ్లూ నా గది వొదిలి బయటికిరాలేదు మా డాక్టర్ సలహా ప్రకారం. ఏమైనా ప్రతీది ఎర్రగా కనిపించడం చాలా పెద్ద జబ్బు. చివరికి నేను తాగే నీళ్లు కూడా నెత్తుర్లా. ఆ స్థితిలో నేను తీసిన ఫొటోలు చూడాలి. నేనేనా తీసింది వాటిని అని నామీద నాకే జాలి వేస్తుంది. మానవ మనోవైకల్యం కింద ఎంత యంత్ర సాంకేతిక స్థిరచిత్తమైనా చెదిరిపోతుంది."

ఆమె మాట్లాడుతూ వుంది.

**5**

ఇంతకీ ఆమె ఎవరు? ఇక్కడికి ఏ పనిమీదొచ్చింది? ఒంటరిదా? ఎవరైనా తోడున్నారా? పెళ్లయిందా? భయం లేదా? ఇట్లా తిరుగుతుంటే ఆమె ఇంట్లో ఎవరూ ఏమీ అనరా? పెంపకంకొద్దీ సందేహాలు.

వర్షాన్నుంచి తలదాచుకోగలిగాను గానీ చావిడిలో రానురాను చలి పెరుగుతోంది. వ్యాపిస్తోంది. బ్యాగ్‌లో నించి శాలువా తీసి కప్పుకున్నాను.

నా శాలువా ఒక అంచు లాక్కుని కప్పుకుందామె ఏం తటపటాయించకుండా. నేను తటాలున శాలువా వదిలేశాను. కానీ అంతలోనే పక్షిరెక్కలా వాలింది సగం శాలువా నా మీద.

ఇదంతా ఏమీ జరగనట్టే మాట్లాడుతోంది ఆమె.

"ఎన్నో రకాల ఆహార పదార్థాలుంటాయి ఓడలో. నువ్వు వృత్తి ఫొటోగ్రాఫర్‌వయితే వీటన్నింటికీ దూరంగా ఉండాలి. నీ శరీరం ఎంత తేలిగ్గా ఉంటే నీ కెమెరా అంత తేలిగ్గా వుంటుంది. దీనికి అరాచకమైన క్రమశిక్షణ కావాలి. కెమెరాను ప్రేమించేవాళ్లకిది సులభ సాధ్యం. కెమెరా కన్నా ప్రేమ సులభం మరొకటి లేదు. నువ్వు నిమగ్నమైతే చాలా సులభంగా దానికి దగ్గర కావచ్చు. కష్టసాధ్యమైన ప్రత్యేకమైన ఫొటోలు తియ్యాలంటే నువ్వూ అంతే ప్రత్యేకంగా జీవించాలి. దీనికి దగ్గర దారిలేదు."

ఆ అమ్మాయి వాక్ ప్రవాహానికి అంతం లేకుండా వుంది.

ఇంత దగ్గరగా అపరిచితుడితో ఒకే శాలువలో ఉండటం గురించి అసలేమీ ఫీలవుతున్నట్టు లేదు.

**6**

"మనుషుల్లాంటివే మబ్బుల ఉరవడీ వాటి చలచ్చంచల రూపాలూ. ఇవన్నీ కూడా మనకు తెలీని మేథమేటికల్ యీక్వేషన్స్ ప్రకారమే ఉంటాయేమో.

వాటిని చదవడానికి ఎప్పుడైనా ప్రయత్నించావా? ఒకసారి మబ్బులు నల్లని మందలు మందలుగా మా ఓడను చుట్టుముట్టాయి. నేను చూస్తూ ఉండగానే మబ్బుల మధ్య నుంచి ఒక తెల్లటి తలుపు తెరుచు కుంది. అది చూసి తీరాలి. ఆ దృశ్యం ముందు మాటలు వొట్టిబోతాయి. ఏదో తెగినట్టుగా దూకింది వాన దాన్లోంచి ఒకేఒక పెద్ద చినుకుగా. సముద్రంలోకి ఎవరో ఒక పారదర్శకమైన స్తంభాన్ని దింపుతున్నట్టుగా ఉందది.

"అప్పుడు నా చేతిలో కెమెరాలేదు. పరిగెత్తాను. కిందికి కేబిన్‌లోకి. తాళం వేసుంది. ఎవరూ లేరు. ఆర్త నాదం చేశాను. బెల్‌బోయ్ పడుతూ లేస్తూ వచ్చాడు ఏం జరిగిందోనని. లోపలికెళ్లి కెమెరాతో ఒక్క ఊపున డెక్ మీదికొచ్చాను. ఏం లేదక్కడ.

"సముద్రం మీద అమిత వేగంగా ప్రయాణిస్తున్న ఓడలో వున్నాను నేను. మామూలుగా ఉంది ఆకాశం. అంతా ఇంతకుముందు కనిపించిందంతా ఎవరో తుడి చేసినట్టుగా వుంది. ఆ కోత ఇప్పటికీ నా జ్ఞాపకాల్లో సలుపుతూ వుంటుంది.

"వానచాలును ఎప్పుడో దాటేసింది ఓడ. మా ఫొటోగ్రాఫర్లది ఉత్కంఠభరితమైన వృత్తి. కెమెరా అనేది మా శరీరంగా మారిపోవాలి. మీ రచయితలదే సులు వంటే," అని ఓరగా చూసిందామె.

## 7

నేను తుళ్లిపడి- "నేనేం రచయితను కాను," అన్నాను సాక్ష్యంగా కెమెరా చూపిస్తూ.

"వూరికే అన్నా. ఎవరినైనా ఏమైనా చేయగలదీ వాతావరణం. ఆంధ్రదేశంలో ఇప్పటికి నాలుగువేల మందికి పైగా కథలు రాసి అచ్చేశారు. మీకు కూడా వేరే వృత్తి వల్ల జీవనం గడిచిపోతుంటే ఒకటీ రెండు రచనలు రాసి మరిచిపోతారు. కెమెరాతో తప్ప ఇంక దేన్తోనూ రోజు గడవదు నాకు. అప్పుడప్పుడు ఏమీ తినడానికి లేకపో వడం నిజమేగాని ఈ వృత్తికి అది తప్పదు. మబ్బుల్ని చదవగల పూర్తికాలం వృత్తి రచయితలున్నారా మీలో ఎవరైనా?"

ఆమె బిగ్గరగా మాట్లాడుతోంది.

"తెలివితక్కువ దృశ్యాలకి ఫిలిమ్ వృథా చేశా ననుకో, అసలు చిత్రాన్ని పసిగట్టినప్పుడు ఖాళీ కెమెరా వెక్కిరిస్తుంది. సముద్రం మీద ఫిలిమ్ దొరకదు. వొక్కొక్క సారి చేతిలో కెమెరా ఉండగానే సూర్యోదయాలూ సూర్యాస్తమయాలు అట్లా కరిగిపోతుంటాయి. సూర్య చంద్రుల ఉదయాస్తమయాలు సముద్రం మీద అద్భుతంగా కనిపించే నిర్మాణాలు. కానీ ప్రయోజనం లేని ఈ దృశ్యాలకి ఫిలిమ్ ఎందుకు వృథా చేస్తారో తెలీదు."

"ప్రయోజనం లేనివా?," అని ఆశ్చర్యపోయాను నేను.

"కాదా? చావు పుట్టుకల్లాంటివవి. వాటిలో ఏవో ఉన్నాయని వెతకబోతే వర్తమానంలో మిగలవు. అందుకే శాశ్వత సత్యాలంటే అసహ్యం నాకు," అంది ఆ అమ్మాయి. "ముఖ్యంగా మబ్బులు అనుక్షణం కొత్తగా ఉండే వాటి రంగులు వాటిలోని ఉరుములూ మెరు పులూ వాటి అంచుల్లో మెరిసే ఫిలాసఫర్స్ లైన్ ఇష్టం నాకు," అంది.

"శాశ్వత సత్యాల లోగుట్టు నాకీ కెమెరా వల్లే తెలిసింది. ప్రపంచంలోని ఏ ప్రాంతంలోని ఏ మనిష యినా ఈ కెమెరా ఉపయోగించవచ్చునుకుంటాం. కానీ లెనిన్‌గ్రాడ్‌లో నువ్వు తీసిన ఫొటోలకి తమిళనాడులో నువ్వు తీసిన ఫొటోలకీ పోలికే వుండదు. లెనిన్‌గ్రాడ్‌లో సూర్యకిరణాలు నిరంతరం 30 డిగ్రీలు ఏటవాలుగా వుంటాయి. వాతావరణంలో తేమ శాతం ఎక్కువ. ధూళి తక్కువ," అని ఆమె ముందున్న బరువైన బ్యాగ్ ఎత్తింది.

"యీ యేరీఫ్లెక్స్ ఆ వాతావరణానికి సరిపడేది. దేశవాళీ నిర్మాణం కాదు. ఇంకో భయంకరమైన సత్యం ఏమంటే ఈ కెమెరా తెల్లతోలును ఆకర్షించి నల్లతోలును వికర్షిస్తుంది."

ఆమె ఇప్పుడు తనలో తనే మాట్లాడుకుంటు న్నట్టు తగ్గించి వేసింది గొంతు.

"చల్లని ఎండా వెచ్చని చలీ విసురులేని గాలీ ముసురులేని వానా ఎంతో ఇష్టం నాకు," అంది అసం దర్భంగా.

కొద్దిసేపటికి ఆమె తల నా భుజం మీద వుంది. హాయిగా నిద్రపోతోంది.

నేనా కాపలా?

తువ్వాలు నుంచి ఇంకో పేలిక లాగి అంటించా. తెల్లవేటకి.

నా దృష్టి ఆమె బ్యాగ్ మీద పడింది వింత సైజులో వుంది. చూడబోయి ఎత్తా. నిద్రలో వుండే ఒక చేతిని బ్యాగ్ మీద వేసింది ఆ అమ్మాయి అలర్ట్‌గా.

నేను ఒక చేతిని వెనక్కి తీసుకున్నానుగానీ దాని అసాధారణమైన బరువుకు మాత్రం ఆశ్చర్యపోయాను.

ఒకసారి ఆమె ప్రయాణించిన ఓడలో ఒక కళాసీ తటస్థించాడట. మబ్బుల వన్నె తెన్నూ చూసి ఏ దిక్కున ఏ వాన ఎప్పుడు పడేదీ కచ్చితంగా చెప్పేవాడంట. ఎట్లా

చెబుతావ్ అని కెప్టెన్ అడిగితే వివరించడానికి ఎంతగానో ప్రయత్నించాడట. నాకేం అర్థంకావడం లేదని పెదవి విరిచేవాడంట కెప్టెన్.

"పుస్తకాల్లోకి ఎక్కింది తప్పి ఇంకేం అర్థం చేసుకోలేని పుస్తక మానవులం. పుస్తకాల్లో కెక్కిన గతాన్నుంచి కళ్ల ముందు జరిగేదాన్ని అర్థం చేసుకోవాలనుకుంటాం. మన తలకాయల్లో గాలీ వెలుతురూ లేని భయానకమైన కట్టుబాట్ల కారణంగా కొత్తవి నేర్చుకోం. పాతవి మర్చిపోం. ఇంకా అక్షరాల్లోకి అనువాదం కాని కళ్లెదుటి కాలం ఆ ఓడ కళాసీలా అర్థం కానిదయిపోయింది. పుస్తకాలకి జడిసి పుస్తకాలతో జడిపించీ ప్రతీదాన్నీ దూరం నుంచి పరిచయం చేసుకుని జాగ్రత్తలతో దగ్గరికి జరిగే వాళ్లకి ఏదయినా అర్థం అవుతుందా? మాటలతోనే అర్థమైపోయే విషయాలు ఎంత అల్పమైనవి," అని మాట్లాడుతూ మాట్లాడుతూ నిద్రలోకి జారిపోయిందామె.

నా పైన కొత్త బరువు.

నాకెప్పుడు నిద్రపట్టిందో తెలీదు. మెలకువ వచ్చి చూస్తే వర్షమూ లేదు. ఆ అమ్మాయీ లేదు. మిగతా వాళ్లూ లేరు.

ఇక్కడితో నా రఫ్ నోట్స్ ముగిసింది.

అంతా విన్న నా కెమెరామన్ స్నేహితుడు- యేరీ ఫ్లెక్స్ అనేది మామూలు బ్యాగ్‌లో పట్టదే. అది మూవీ కెమెరా. పైగా హ్యాండిల్ వుంటుంది దానికి అని ఆలోచిస్తున్నాడు.

ఆ పిల్ల మాట్లాడింది ఫొటోగ్రఫీ గురించేనా? ఆ సముద్రమూ మబ్బులూ కెమెరా నాకు సంబంధించిన దేన్నో చెబుతూ వున్నాయి అనిపించింది.

మరిచాను. షూట్ చెయ్యడం గురించి ఆమె అన్నది. రాయనే లేదు నేను. కానీ అది పూర్తిగా కొత్త ఇతివృత్తం. ఇక్కడ అతకదు.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 26 ఏప్రిల్ 1998*

